క్లుప్తంగా

సుబ్రహ్మణ్య స్వామికి షష్టి పూజలు

మద్దికెర : స్థానిక మద్దమ్మ చెరువు గట్టు మీద కొలువైన శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి బుధవారం శుద్ధ షష్టిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక పంచామృతాభిషేకాలు, అశ్లేష నక్షత్ర దోషం, కుజ గ్రహ కాల సర్పదోష, రాహుకేతు నివారణ, ఆరోగ్య, సంతాన సౌభాగ్యం కోసం హోమాలు చేపట్టారు. పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ నిర్వాహకులు విజయ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా ఓబులేసు స్వామి ప్రభోత్సవం



తొగలుగల్లులో ప్రభను లాగుతున్న భక్తులు

ఆస్పరి: మండలంలోని తొగలుగల్లు గ్రామంలో బుధవారం ఓబులేసు స్వామి ప్రభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఓబులేసు స్వామి, చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఆశీనులు గావించి మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం ప్రభపై అధిష్టింపజేసి కొండ వరకు లాగారు. ఈ సందర్భంగా నంది కోలు, బుక్కపిండి సేవ, నుగ్గులాట తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

ముగిసిన దేవర



పూజలందుకున్న మారెమ్మ

కృష్ణగిరి: మండలంలోని ఆగవేలి గ్రామంలో రెండు రోజులుగా జరుగుతున్న గ్రామ దేవతల దేవర బుధవారం ముగిసింది. తెల్లవారుజామునే గ్రామ దేవతలైన పెద్దమ్మ, సుంకులమ్మ, మారెమ్మ, కర్రెమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ పొలిమేర చుట్టూ తిరిగి అమ్మవార్లకు బలిదానం నిర్వహించారు. అనంతరం ప్రతి ఇంటి నుంచి అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఈ-కేవైసీకి నేటి వరకు గడువు

తుగ్గలి : రైతులు ఈ-కేవైసీ, ఈ-క్రాప్ నమోదు చేయించుకునేందుకు గురువారం వరకు గడువు ఉన్నట్లు వ్యవసాయశాఖ మండల అధికారి పవన్ కుమార్ తెలిపారు. మండలంలో రబీ సీజన్‌లో 3,691 హెక్టార్లలో రైతులు పంటలు వేశారన్నారు. 2,995 మంది రైతులకు గాను 2,681 మంది ఈ-కైవైసీ చేయించుకున్నారని చెప్పారు. ఈ నెల 7నుంచి11వ తేదీ వరకు నమోదు చేసుకున్న రైతుల వివరాలు గ్రామాల్లోని ఆర్ఎస్‌కేల్లో ప్రదర్శిస్తారని చెప్పారు.

చిప్పగిరి: రబీ సీజన్‌లో పంటలు నమోదు చేసుకున్న ప్రతి రైతు తప్పనిసరిగా ఈ- కేవైసీ చేసుకోవాలని ఏఓ జయలక్ష్మి రైతులకు సూచించా రు. బుధవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అందించే ప్రతి సంక్షేమ పథకం పొందాలంటే క్రాప్ బుకింగ్‌తో పాటు ఈ- కేవైసీ తప్పనిసరి అన్నారు.

ఆధార్ నమోదు వేగవంతం చేయాలి

ఆలూరు రూరల్: బాల ఆధార్ నమోదు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ మహబూబ్ బాషా అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బందికి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ పద్మావతి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. నేటి నుంచి ప్రతి రోజు మండలంలోని ఒక సచివాలయంలో బాల ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. మండలంలో 2,600 మంది పిల్లలు ఉన్నారని ఇప్పటి వరకు 1,321 మందికి నమోదు చేసినట్లు తెలిపారు.

సారా తయారుచేస్తే కేసులు

పత్తికొండ రూరల్ : తాండాల్లో నాటుసారా తయారు చేస్తే కేసులు తప్పవని పత్తికొండ ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు, ఎస్ఐ సాయిప్రవీణ్ హెచ్చరించారు. నవోదయం 2.0లో భాగంగా బుధవారం పెండ్లిమాన్ తండా, గిడ్డమ్మతండాల్లో గ్రామ సభ ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ నాటుసారా తయారీ, విక్రయం చట్టరీత్యా నేరమని చెప్పారు. సారా వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

స్త్రీ, పురుషులిద్దరూ సమానమే



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మాధురి

పత్తికొండ రూరల్ : సమాజంలో స్త్రీ, పురుషులిద్దరూ సమానమేనని పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాధురి అన్నారు. బుధవారం స్థానిక కళాశాలలో లింగ వివక్షత, ఆహారంలో పోషకాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐ జయన్న హాజరై లింగ వివక్షత చట్టరీత్యా నేరమని తెలిపారు. రోజువారీ దినచర్య, ఆహారపు అలవాట్లు శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడేలా చూసుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పవన్‌కుమార్, మహిళా సాధికారత కోఆర్డినేటర్ నీరజాక్షి పాల్గొన్నారు.

హొళగుందలో పారిశుద్ధ్య పనులు

హొళగుంద: వేసవి కాలం మొదలు కావడం, దోమల బెడద తీవ్రం కావడంతో బుధవారం మండల కేంద్రంలో సర్పంచ్ చలవాది రంగమ్మ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ప్రత్యేక పారిశుద్ధ్యం పనులు చేయించారు.

ఆదర్శం..ఆహ్వానం

- మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాలకు అవకాశం
- నోటిఫికేషన్ జారీ చేసిన విద్యాశాఖ
- ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ
- ఆలూరు,ఆస్పరి మండల కేంద్రాల్లో మోడల్ స్కూళ్లు

ఆలూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యనందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్స్) లలో ప్రవేశాల కోసం రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆలూరు నియోజకవర్గంలోని ఆలూరు,ఆస్పరి మండల కేంద్రాల్లోని మోడల్ స్కూళ్లలో 80 సీట్లు చొప్పున కేటాయించారు.

6లో ప్రవేశం పొందితే.. ఇంటర్ వరకు..

పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు ఉన్నత చదువులను అందుబాటులోకి తీసుకురావటమే ధ్యేయంగా ఏపీ మోడల్ స్కూల్స్ ఏర్పాటయ్యాయి. వెనుకబడిన మండలాలను గుర్తించి ఈ పాఠశాలలను ప్రారంభించారు.ఇందులో ఆరో తరగతిలో ప్రవేశం పొందితే ఇంటర్ వరకు ఇంగ్లిష్ మీడియం బోధన అందించడంతో పాటు విద్యా కానుక కిట్లు, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే బాలికలకు కార్పొరేట్ తరహా హాస్టల్ వసతి ఏర్పాటు చేశారు. పూర్తి ఇంగ్లిష్ మీడియం స్కూల్/జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలు పొందడం అంత సులువు కాదు. ప్రైవేటు పాఠశాలల్లో ఎంతో ఖర్చు పెట్టినా అందుబాటులో లేని నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం విద్య ఇక్కడ అందుబాటులో ఉండటం పేద పిల్లలకు వరంగా మారింది.



ఆలూరులోని మోడల్ స్కూల్



విద్యార్థినులకు అందుబాటులో ఉన్న హాస్టల్

పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



మోడల్ స్కూల్ ప్రవేశ ప్రక్రియపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉంటుంది. 9 నుంచి ఇంటర్ వరకు బాలికలకు హాస్టల్ సౌకర్యం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లోని పేద,మధ్య తరగతి విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.ఆన్‌లైన్ దరఖాస్తుకు ఈ నెలాఖరుకు తుది గడువు.

– రాఘవరావు, ప్రిన్సిపాల్, ఏపీ మోడల్ స్కూల్,ఆలూరు

దరఖాస్తు ఇలా..

- 2025-26 విద్యా సంవత్సరానికి గత నెల 24వ తేదీ నుంచి నెట్ బ్యాంకింగ్/క్రెడిట్/డెబిట్ కార్డుల ద్వారా ఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం కల్పించారు.
- దరఖాస్తు చేసుకునే ప్రక్రియ ఆన్‌లైన్ పేమెంట్స్‌కు మార్చి 31వ తేదీన గడువు ముగియనుంది.
- గతేడాది మాదిరిగానే 6వ తరగతి ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నారు.
- దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆయా మోడల్ స్కూళ్లలోనే ఏప్రిల్ 20వ తేదీ ఉదయం 10 మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.
- మెరిట్ లిస్టు ఆధారంగా రోస్టర్ ప్రకారం సీట్లు కేటాయించనున్నారు.
- ఏప్రిల్ 27న మెరిట్ లిస్టు, అదే రోజు ఎంపిక జాబితాను వెల్లడించనున్నారు.
- ఏప్రిల్ 30న సర్టిఫికెట్ల పరిశీలనతో పాటు కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టనున్నారు.
- కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

గుర్తుంచుకోవాల్సిన ముఖ్య విషయాలు..

- 6వ తరగతిలో ప్రవేశం పొందాలనుకునే ఓసీ,బీసీ కులాలకు చెందిన విద్యార్థులు 2013 సెప్టెంబర్ 1 నుంచి 2015 ఆగస్టు 31వ తేదీ మధ్యలో జన్మించి ఉండాలి. వీరు 5వ తరగతిలో కనీసం 35 మార్కులు పొంది ఉండాలి. వీరికి పరీక్ష ఫీజు రూ.150 చెల్లించాలి.
- ఎస్సీ,ఎస్టీ కులాల విద్యార్థులు 2011 సెప్టెంబర్ 1 నుంచి 2015 ఆగస్టు 31వ తేదీ మధ్యలో జన్మించి ఉండాలి. వీరు కనీసం 35 మార్కులు పొంది ఉండాలి. పరీక్ష ఫీజు రూ.75 చెల్లించాలి.
- సంబంధిత జిల్లాలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో నిరవధికంగా 2023-24, 2024-25 విద్యా సంవత్సరాల్లో 4,5 తరగతుల్లో ఉత్తీర్ణులై ఉండాలి.
- పరీక్షలో వచ్చే మార్కులు, రూల్స్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారు.
- ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రం ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది.
- 5వ తరగతి స్థాయిలో ఉండే ఈ పరీక్షకు తెలుగు/ఇంగ్లిష్ మీడియంలో రాత పరీక్ష ఉంటుంది. cse.ap.gov.in లేదా apms.ap.gov.in వెబ్‌సైట్‌లో ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి.

గ్రామాలను అభివృద్ధి చేసుకుందాం

తుగ్గలి : అధికారులకు పార్టీలు, వర్గాలు అవసరం లేదు. ఎవరి ఒత్తిళ్లకు లొంగవద్దు. మీరు ఇక్కడ కాకపోతే మరెక్కడైనా పనిచేయొచ్చు. మీరు ఎన్నో ఏళ్లు విధుల్లో ఉంటారు. మేం ఐదేళ్లు మాత్రమే ఉండే వాళ్లం. పార్టీలకతీతంగా ప్రజలకు పనులు చేసి పెట్టి మన్ననలు పొందాలి. గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ ఎర్ర నాగప్ప యాదవ్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఉపాధి హామీ పథకంలో రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలని మండల కో ఆప్షన్ సభ్యుడు చాంద్‌బాషా సూచించారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్ మాట్లాడుతూ..అధికారులు పక్షపాతం లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. ఇన్‌చార్జ్ ఎంపీపీ మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని దీన్ని సహించబోమని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అభివృద్ధి పనుల విషయంలో సర్పంచ్‌లు తీర్మానాలు ఇవ్వా లని కోరారు. ఎండలు ముదురుతున్నందున గ్రా మాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేష్ ను ఆదేశించారు. ఎంపీడీఓ విశ్వమోహన్, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రాముడు, వైస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, హౌసింగ్ డీఈ విజయ మోహన్, సీడీపీవో లలిత, ఈవోపీఆర్డీ శ్రీహరి, ఎఈవో మాలతి, ఏఓ పవన్‌కుమార్, ఏపీఓ హేమసుందర్, ఏపీఎం రాధాకృష్ణ, వైద్యాధికారిణి హరిత, పశువైద్యాధికారి వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీపీ ఎర్ర నాగప్ప

'సంచార చికిత్స' తనిఖీ

పత్తికొండ రూరల్ : పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆరోగ్య ఆయుష్ మందిర్‌లో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వేసవి దృష్టిలో ఉంచుకుని ప్రజలకు వడదెబ్బ లక్షణాలు-ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించాలని వైద్యాధికారికి సూచించారు. వైద్యాధికారి సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

దేవనకొండ:మండలంలోని పొట్లపాడు గ్రామ సచివాలయంలో నిర్వహించిన సంచార చికిత్స కార్యక్రమాన్ని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు బుధవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య సేవల్లో ప్రజల్లో సంతృప్త స్థాయి పెరగాలన్నారు.వైద్యాధికారి కల్యాణ్ చంద్రశేఖర్, సామాజిక ఆరోగ్యాధికారి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు

ముగిసిన గాదిలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో గాదిలింగేశ్వరస్వామి

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామంలో గాదిలింగేశ్వరస్వామి, సిద్ధలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం వసంతోత్సవంతో ముగిశాయి. ప్రతి ఇంటి నుంచి ఆడపడుచులు కలశాలతో ఊరేగింపుగా గాదిలింగేశ్వరస్వామి వారి ఆలయానికి చేరుకుని నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం స్వామివార్లకు జలాభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన తదితర విశేష పూజలు నిర్వహించారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

జోరుగా కొనుగోళ్లు..

గూళ్యం గ్రామంలో స్వామివారి రథోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన ఎద్దుల పర్కి ఆకట్టుకుంది. రైతులు ఎద్దులను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. ఎద్దులు రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకు ధర పలికాయి. చుట్టుపక్కల గ్రామాల వారు గృహోపకరణాల కొనుగోలుతో సందడి నెలకొంది. ఇక చిన్నారులకు గంగరాటం, బోట్లు తదితర వాటిని ఏర్పాటు చేశారు. బొమ్మ, గాజుల, మిఠాయి అంగళ్లు వెలిశాయి.



బోటులో చిన్నారుల సందడి





ఎద్దులను పరిశీలిస్తున్న రైతులు, ఎద్దులకు సంబంధించిన వస్తువులను కొనుగోలు చేస్తున్న రైతులు

హోసూరులో ఉద్రిక్తత

- టీడీపీ నాయకుడి హత్యకేసు నిందితుడు గ్రామానికి రాక..
- బైక్‌కు నిప్పుపెట్టిన మృతుడి బంధువులు, గ్రామస్తులు
- గ్రామంలో పోలీసుల గస్తీ

పత్తికొండ రూరల్: మండలంలోని హోసూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వాకిటి శ్రీనివాసులు హత్యకేసులో నిందితుడైన హరి బుధవారం గ్రామానికి రావడంతో మృతుడి బంధువులు, గ్రామస్తులు కొందరు అతని బైక్‌కు నిప్పు పెట్టారు. హత్య ఘటన నాటి నుంచి నిందితుడు, అతని భార్య స్వగ్రామమైన మద్దికెరలో ఉంటున్నట్లుగా తెలిసింది. రెండు రోజుల క్రితం నుంచి గ్రామానికి వచ్చి వెళ్తున్నట్లుగా తెలియడంతో మృతుడి బంధువులు కోపోద్రిక్తులై అతని బైక్‌కు నిప్పు పెట్టడంతో అక్కడున్న వారు మంటలు ఆర్పివేశారు. ఈ క్రమంలో కొందరు నిందితుడిపై దాడికి యత్నించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఘటనా స్థలికి చేరుకోవడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. సమాచారం తెలుసుకుని పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్, అర్బన్ సీఐ జయన్న వెంటనే గ్రామానికి చేరుకుని గ్రామస్తులను చెదరగొట్టారు. గ్రామంలో మళ్లీ అలజడి చెలరేగినట్లేంది. నిందితుడు గ్రామానికి వస్తున్నట్లు తమకు సమాచారం లేదని పోలీసులు తెలిపారు.



గ్రామస్తులకు సర్దిచెబుతున్న పోలీసులు

నేటి నుంచి ఉచ్చీరప్ప ఉత్సవాలు



ఉచ్చీరప్పతాత

ఆలూరు: మండలంలోని పెద్దహోతూరు ,మరకట్టు గ్రామాల్లో కొలువుదీరిన శ్రీ ఉచ్చీరప్ప, శ్రీచలువప్పతాత ఉత్సవాలను గురువారం ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు, గ్రామ పెద్దలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉచ్చీరప్ప తాతకు ఈనెల 12వ తేదీ వరకు ప్రత్యేక పూజలు, 13న విశేష పూజలు, సాయంత్రం రథోత్సవం ,14న సాంస్కృతిక కార్యక్రమాలు, 15న ఉదయం దేవతామూర్తులు గ్రామోత్సవం పల్లకోత్సవం,అనంతరం వసంతోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. కాగా. దాదాపు రూ.2 కోట్లు వెచ్చించి రాజగాలిగోపురం, ఆలయం ప్రాంగణంలో భక్తులకు రేకుల షెడ్, పెయింటింగ్ తదితర పనులు చేపట్టారు.

ధరల హామీ చట్టాన్ని అమలు చేయాలి

దేవనకొండ: రైతుల సంక్షేమం కోసం గిట్టుబాటు ధరల హామీ చట్టాన్ని అమలు చేయాలని, జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టు పూర్తి చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.నాగేంద్ర, రైతుసంఘం మండల గౌరవాధ్యక్షుడు వై.కందప్ప, సీపీఐ మండల కార్యదర్శి నరసారావు డిమాండ్ చేశారు. బుధవారం దేవనకొండలో ఏపీ రైతు సంఘం (ఏఐకేఎస్) సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కృష్ణ, రవికుమార్, అనుమప్ప, కోదండ, మహమ్మద్ పాల్గొన్నారు.

ఎల్ఎల్‌సీ, హెచ్ఎల్‌సీ అధికారులకు పురస్కారాలు

హాలహర్వి: తుంగభద్ర డ్యాం నిర్మించి 72ఏళ్లు పూర్తి కావడంతో టీబీ డ్యాం అధికారులు ఎల్ఎల్‌సీ, హెచ్ఎల్‌సీ ప్రాజెక్టుల కింద పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రతిభా పురస్కారాలను బుధవారం తుంగభద్ర డ్యాం కార్యాలయంలో అందజేశారు. ఇందులో భాగంగా డ్యాం ఈఈ నారాయణనాయక్ ఆధ్వర్యంలో డ్యాం చైర్మన్ ఎస్.ఎన్.పాండే, సెక్రటరీ ఆర్.కె.రెడ్డి ఎల్ఎల్‌సీ కెనాల్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు, ఉద్యోగులకు పురస్కారం అందజేసి సత్కరించారు. చింతకుంట సెక్షన్ పరిధిలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగేంద్ర , బాపురం సెక్షన్ పరిధిలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగరాజు పురస్కారం అందుకున్నారు. ఎస్‌డీవో హసన్‌బాషా, జేఈ కిరణ్ పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న చింతకుంట కెనాల్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర

సమస్యాత్మక భూముల పరిశీలన

కృష్ణగిరి: మండలంలోని మాదాపురం గ్రామ సమీపంలోనున్న సమస్యాత్మక భూములను బుధవారం పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్ పరిశీలించారు. అమకతాడు పంచాయతీ పరిధిలోని మాదాపురంలోని 700/1, 759/ఏ1 సర్వే నంబర్లను కొందరు ఆక్రమించారని గ్రామ దళితులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించామని ఆర్డీఓ తెలిపారు. గ్రామంలోని 13 మంది దళితులకు 2005లో అసైన్‌మెంట్ కింద పట్టాలు ఇచ్చారన్నారు. ప్రస్తుతం ఈ భూముల స్థితిగతులను పరిశీలించి, సర్వే చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. తహసీల్దార్ చంద్రశేఖర్, వీఆర్వో శ్రీధర్, సర్వేయర్లు ఉన్నారు.



మాదాపురం వద్దనున్న భూముల వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ భరత్‌నాయక్

రైతులందరూ విశిష్ట సంఖ్య పొందాలి

మద్దికెర : రైతులందరూ గుర్తింపు సంఖ్యను సత్వరమే పొందాలని, అలాగే రబీ సీజన్‌లో పంట నమోదు చేసుకున్న రైతులు ఈ-కేవైసీ చేసుకోవాలని ఏఓ రవి తెలిపారు. బుధవారం మండలంలోని పెరవలి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంట నమోదు చేసుకున్న రైతుల పేర్లు సామాజిక తనిఖీ కోసం రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తారని చెప్పారు. పంట నమోదు రైతుల జాబితాలో ఏవైనా సవరణలు ఉంటే వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలని సూచించారు.

లారీ నుంచి డీజిల్ చోరీ

ఆలూరు రూరల్: ఆగివున్న లారీ నుంచి గుర్తుతె లియని వ్యక్తులు 350 లీటర్ల డీజిల్ దొంగలించారు. మండలంలోని హైవే- 167లో ఉన్న మనేకుర్తి గ్రామం వద్ద బుధవారం తెల్లవారు జామున ఘటన జరిగింది. డ్రైవర్ మారేష్ తెలిపిన వివరాలు.. కేఏ 34 సీ 7024 నంబర్ గల లారీ రాయచూర్ నుంచి సిమెంట్ లోడుతో బళ్లారికి వెళ్తోంది. బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో డ్రైవర్‌కు నిద్ర రావడంతో మనేకుర్తి గ్రామంలో లారీ నిలిపి నిద్రపోయాడు. ఆ సమయంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు లారీ ట్యాంకు మూతను తెరిచి అందులో ఉన్న 350 లీటర్ల డీజిల్ ఎత్తుకెళ్లారు.

9న మంగమాంబ రథోత్సవం

ఆలూరు: మండలంలోని కమ్మరచేడు, కరిడిగుడ్డం గ్రామాల్లో వెలసిన శ్రీ మంగమాంబ రథోత్సవం ఈనెల 9వ తేదీన నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఆలయ కమిటీ సభ్యులు అధికారుల అనుమతి కోరారు.

అనారోగ్యంతో జవుళి రత్నకుమార్ మృతి

తుగ్గలి : మండలంలోని పెండేకల్లు రైల్వే జంక్షన్‌కు చెందిన వ్యాపారవేత్త జవుళి రత్నకుమార్ (68) మృతి చెందారు. కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు.